సాక్షి పల్నాడు

మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



భక్తిగా చండీ హోమం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం చండీహోమం నిర్వహించారు.



పులిచింతలసమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,16,034 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 88,979 క్యూసెక్కులు వదులుతున్నారు.



దుర్గగుడిలో ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చంద్రగ్రహణం అనంతరం దుర్గమ్మ ఆలయాన్ని ఆలయ అర్చకులు శుద్ధిచేశారు. సోమవారం స్నపనాభిషేకం, విశేష అలంకరణ, పూజలు జరిపించారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరునికి గ్రహణానంతర ప్రత్యేక పూజలు



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలో చంద్ర గ్రహణానంతరం సోమవారం అమరేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం వేకువజామున ఆలయశుద్ధి అనంతరం ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో సంప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా విశ్వేశ్వర పూజ, నవగ్రహ మంటపారాధన, పుణ్యాహవాచన నిర్వహించి అనంతరం పుణ్యాహవాచన జలాలను మేళ తాళాలతో అమరేశ్వరునికి అభిషేకించారు, అలాగే బాలచాముండేశ్వరి అమ్మవారికి, ఉపాలయాల్లో అభిషేకం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.

యూరియా అవగాహన బృందాలు ఏర్పాటు

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: యూరియాపై రైతుల్లో ఆందోళనలు తొలగిస్తూ వాస్తవ పరిస్థితులను వివరించేందుకు గ్రామస్థాయిలో అవగాహన బృందాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వెల్లడించారు. వీఆర్వో, మహిళా పోలీసు, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు బృందంలో సభ్యులుగా వ్యవహరిస్తారన్నారు. సోమవారం యూరియా అంశంపై కలెక్టర్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ బృందాలు ప్రతి రైతు వద్దకు వెళ్లి జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్న విషయం వివరించాలన్నారు. యూరియా పొందడంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగుచేసిన భూమికి అవసరమైన యూరియా రైతులకు లభించిందా అనే అంశాలపై అధికారులకు నివేదిస్తారన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదన్న విషయం స్పష్టం చేస్తూనే, అవసరానికి మించి యూరియా కొనుగోళ్లు చేయవద్దని రైతులకు విజ్ఞప్తి చేయాలన్నారు. రానున్న మూడు రోజులు మండల స్పెషల్ ఆఫీసర్లు మండలాల్లోనే ఉండి యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు.

దయకలిగిన తల్లి వేళాంగణి మాత



పాలువాయిజంక్షన్(రెంటచింతల): దయకలిగిన తల్లి వేళాంగణిమాత అని రాయవరం విచారణ గురువులు రత్నబాబు అన్నారు. పాలువాయి జంక్షన్‌లోని వేళాంగణిమాత మందిరం 26వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి నేతృత్వంలో సమష్టి పవిత్ర దివ్యపూజాబలిని సమర్పించారు. ఫాదర్ రత్నబాబు మాట్లాడుతూ వేళాంగణిమాతలోని ప్రేమ, దయ, కరుణ, క్షమాపణ, వినయం, విశ్వాసం, శాంతి, సమాధానాలు వంటి సుగుణాలను క్రైస్తవులు అలవర్చుకొని దేవుని కృపకోసం ప్రార్థించాలన్నారు. అనంతరం మందిరం వ్యవస్థాపకులు దుగ్గింపూడి అనిత కస్పారెడ్డి నేతృత్వంలో భక్తులకు మహా అన్నదానం చేశారు. తుమ్మకోట విచారణ గురువులు రె.ఫాదర్ పవిత్రన్, ఫాదర్ కొణతం ఏలీషా రాజు, కన్యస్త్రీలు, చర్చిపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కొరత.. గుండెకోత

- రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయంటున్న అధికారులు
- మార్కెట్లో అందుబాటులో లేని వైనం
- పక్క రాష్ట్రాలకు తరలించి బ్లాక్‌లో అమ్ముకుంటున్న మాఫియా
- యూరియా కొరతను సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- బస్తాకు రూ.200 వరకు అదనంగా వసూలు
- ప్రకటనలతో కాలక్షేపం చేస్తున్న ప్రభుత్వం, అధికారులు
- రైతు పక్షాన పోరాడటానికి పోరుబాటకు పిలుపునిచ్చిన వైఎస్సార్ సీపీ
- నేడు ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన

జిల్లాలో తీవ్రంగా యూరియా కొరత



పిడుగురాళ్ల జీడీసీఎంఎస్ గోడౌన్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లభించక నష్టపోతున్నారు. గతంలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ఆర్‌బీకే కేంద్రాలలో లభించేవి. ప్రస్తుతం వాటిని రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి నిర్వీర్యం చేశారు. జిల్లాలో రైతులకు అవసరమైనంత యూరియాను సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైంది. మరోవైపు అధికారపార్టీ నేతలు, ప్రైవేట్ వ్యాపారులు జిల్లాలో యూరియాను కృత్రిమ కొరత సృష్టించి రైతులను నిలువునా దోచుకుంటున్నారు. గత పదిహేను రోజులుగా రైతులు యూరియా బస్తాల కోసం కుస్తీలు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదు. దీంతో రైతులు పక్షాన నిలిచే పోరాడే వైఎస్సార్ సీపీ నేడు పోరుబాటకు పిలుపునిచ్చింది. రాష్ట్రంలోని అన్ని ఆర్డీఓ కార్యాలయాల వద్ద రైతులు, నేతలు, కార్యకర్తలతో పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి ఆర్డీఓలకు వినతిపత్రం ఇవ్వనున్నారు.

బస్తాపై అ'ధనం'

జిల్లాలో యూరియా కొరత రైతులను వేధిస్తోంది. రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో రైతులకు అందడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే పంటల సాగు కష్టమవుతుందనే భావన అన్నదాతల్లో నెలకొంది. కొరతను సాకుగా చూపి వ్యాపారులు అధిక ధరకు యూరియాను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. యూరియా కోసం దుకాణాలకు వెళ్తున్న రైతులకు వ్యాపారులు చుక్కలు చూపిస్తున్నారు. యూరియా ధరను ప్రభుత్వం రూ.266 గా నిర్ణయించగా, మార్కెట్లో రూ.480 వరకు విక్రయిస్తున్నారు. బస్తాకు రూ.200 అధికంగా రైతుల నుంచి వసూళ్లు చేస్తున్నారు. మార్కెట్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో అధిక ధరకు విక్రయించాల్సి వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు.



పొందుగల చెక్‌పోస్ట్ వద్ద యూరియాను స్వాధీనం చేసుకున్న అధికారులు (ఫైల్)

సాగు సగమైనా కాలేదు..

పల్నాడు జిల్లాలో సెప్టెంబర్ మాసం మొదటి వారానికి ఖరీఫ్ సాగు 50 శాతం కూడా పూర్తికాలేదు. ఇప్పుడిప్పుడే వరి, మిర్చి సాగు పనులు ముమ్మరమవుతున్నాయి. అయితే జిల్లాలో యూరియా అమ్మకాలు మాత్రం దాదాపుగా పూర్తి అయ్యాయి. ఇది ఎలా సాధ్యమంటే.. మాఫియా సభ్యులు స్థానిక రైతుల పేర్లతో యూరియా కొనుగోలు చేసినట్టు చూపి ఆ బస్తాలను సరిహద్దులు దాటిస్తున్నారు. అయితే సాగు తక్కువగా ఉన్న సమయంలో అంత యూరియా ఎలా విక్రయించారో వ్యాపారులను నుంచి ఆరా తీస్తే అసలు విషయం బయటపడేది. కానీ వ్యవసాయశాఖ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ఎరువుల మాఫియా రెచ్చిపోయి రైతులను కొల్లగొడుతున్నారు. ముఖ్యంగా కారంపూడి, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల లాంటి ప్రాంతాల నుంచి యూరియా పక్కదారి పడుతోంది.

ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం

రైతులకు అవసరమైన ఎరువులను సంతృప్తికర స్థాయిలో అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. ఉన్న అరకొర నిల్వలను ఎరువుల మాఫియాగా మారిన కొందరు అక్రమదారులు ఇతర ప్రాంతాలకు తరలించి మరింత కొరతను సృష్టిస్తున్నారు. ఒకవైపు సరిహద్దు తెలంగాణ జిల్లాలకు ఇక్కడి యూరియాను తరలించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు, మరోవైపు ఇక్కడి యూరియా నిల్వలు తరలిపోవడంతో రైతులకు అవసరానికి తగ్గట్టు లేకపోవడంతో డిమాండ్ పెరిగి ధరలు రెట్టింపు అవుతున్నాయి. దీనివల్ల రెండు రకాలుగా యూరియా మాఫియాకు ఆదాయంగా మారింది.

తెలంగాణకు ఇబ్బడిముబ్బడిగా..

గత నెల రోజులుగా పల్నాడు జిల్లా నుంచి వేల టన్నుల యూరియా పక్కదారి పట్టింది. పక్క రాష్ట్రంలోని పారిశ్రామిక అవసరాలకు సైతం మన యూరియానే సరఫరా అవుతుండటం మరింత ఇబ్బందికరంగా మారుతోంది. యూరియా అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. పది రోజుల క్రితం దాచేపల్లి మండలం పొందుగల వద్ద దొరికిన ఒకటి రెండు సంఘటనలు తప్ప పెద్దగా కట్టిడిచేసిన దాఖలాలు కనిపించడంలేదు. పొందుగల వద్ద రెండు వాహనాలలో తరలిస్తున్న 165 బస్తాలలోని 7,425 కిలోల యూరియాను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు.

రైతు సేవా కేంద్రాలు నిర్వీర్యం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎరువుల కొరతను వ్యాపారులు సృష్టించకుండా ఉండేందుకు ఆర్‌బీకేల్లో సీజన్‌కు అవసరమయ్యే ఎరువులను అందుబాటులో ఉంచేవారు. దీంతో స్థానికంగా ఎరువులు అందుబాటులో ఉండటంతో రైతులు నిశ్చింతగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యేవారు. కూటమి ప్రభుత్వం రైతుసేవా కేంద్రాలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తుంది. ఆర్ఎస్‌కేలకు నామమాత్రంగా ఎరువులను కేటాయిస్తుంది. దీంతో పాటు సొసైటీల ద్వారానే ఎరువులను పంపిణీ చేస్తుంది. అధికార పార్టీ సానుభూతిపరులకే ఆర్ఎస్‌కేలు, సొసైటీలు, జీడీసీఎంఎస్‌లకు కేటాయించిన ఎరువులు అందుతున్నాయి. దీంతో యూరియా కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది.

రైతు పక్షాన పోరుబాట...



రాష్ట్రంలో రైతులు అన్ని విధాల కష్టాలపాలవుతున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కనీసం రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచడం కూడా చేతకాక చేతులెత్తేసింది. ఈ నేపథ్యంలో రైతుల పక్షాన పోరాడేందుకు వైఎస్సార్ సీపీ తరఫున నేడు అన్ని ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాం. రైతులంతా పాల్గొని పోరుబాటను విజయవంతం చేయాలి.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు

వ్యాపారులు చెప్పిన ధరకు కొంటున్నాం



ఎరువుల కోసం దుకాణాలకు వెళ్తే వ్యాపారులు చెప్పిన ధరకు కొనుగోలు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీకి ఎక్కడా యూరియా అమ్మడం లేదు. బస్తాకు రూ.200 అధికంగా చెల్లిస్తేనే యూరియా అమ్ముతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– చెంచయ్య, రైతు, గోనెపూడి

ఎరువులు అందుబాటులో ఉంచాలి...



యూరియా కొరత పేరుతో వ్యాపారులు అధిక ధరకు విక్రయాలు సాగిస్తున్నారు. ఎరువుల పంపిణీపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకుండా పోయింది. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

– అన్నెం పున్నారెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు

'అన్నదాత పోరు' జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ మహిళా విభాగం నాయకులు

వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పీఆర్కే

మాచర్ల రూరల్/మాచర్ల: తగినంత యూరియాను అందుబాటులో ఉంచకుండా రైతులను కష్టాల పాలు చేస్తున్న ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు నేడు అన్నదాత పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతన్నలు యూరియా కోసం రోజుల తరబడి క్యూ లైన్లలో నిల్చోవటం దారుణమన్నారు. యూరియా కొరతను అదుపులోకి తేవటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలో ఆర్బీకేల ద్వారా రైతులకు కావాల్సిన యూరియా, ఎరువులు అందించినట్లు గుర్తు చేశారు. నేడు ఉదయం 10.30గంటలకు గురజాల పార్టీ ఆఫీసు నుంచి గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డితో కలిసి ఆర్డీఓ కార్యాలయం వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం అందజేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం పార్టీ రాష్ట్ర ఎస్టీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు బుల్లా మేరీకుమారి, ఇతర మహిళా నేతలతో కలిసి అన్నదాత పోరు పోస్టర్లను పీఆర్కే ఆవిష్కరించారు.

విజయవంతం చేద్దాం : డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు నరసరావుపేట పట్టణ రెవెన్యూ డివిజన్ పరిధిలో నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులందరూ విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. తనతోపాటు మాజీ మంత్రి విడదల రజని, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో యూరియా, ఎరువుల కొరతపై స్థానిక లింగంగుంట్ల జిల్లా పార్టీ ఆఫీస్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు వెళ్లి ఆర్డీఓకు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట నియోజకవర్గ రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ముస్లిం మైనార్టీలపై కూటమి వివక్ష

- మౌజన్లు, ఇమామ్‌లకు తక్షణమే బకాయిలు చెల్లించాలి
- మైనార్టీ ఆస్తులకు వైఎస్సార్ సీపీ అండ
- పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన డాక్టర్ గోపిరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ ఖాన్



కలెక్టరేట్‌కు తరలి వచ్చిన డాక్టర్ గోపిరెడ్డి, ముస్లిం మైనార్టీ సెల్ నాయకులు

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అందజేయాల్సిన సంక్షేమ పథకాలు, ఎన్నికల హామీలను అమలుచేయకుండా వివక్ష చూపుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పార్టీ ముస్లిం మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ ఖాన్, నియోజకవర్గాల నాయకులతో కలిసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో మైనార్టీల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు నివేదించేందుకు కలెక్టరేట్‌కు తరలి వచ్చారు. అయితే ప్రవేశద్వారం వద్దకు వచ్చిన వారిని గేటు మూసేసి లోపలికి వెళ్లేందుకు పోలీసులు అడ్డుకున్నారు. కేవలం పది మందిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని పోలీసులు చెప్పగా.. పదిమందితో లోపలికి వెళ్లి కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. అనంతరం డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ముస్లింలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. మౌజమ్‌లు, ఇమామ్‌లకు 11 నెలల నుంచి గౌరవ వేతనాలు చెల్లించడంలేదన్నారు. తక్షణమే వారికి జీతాల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు రూ.లక్ష చొప్పున సబ్సిడీ చెల్లించామన్నారు. 2022–23 ఏడాదికి రూ.14.5కోట్లు చెల్లించామన్నారు. 2023–24కు రూ.14 కోట్లు బడ్జెట్‌లో కేటాయించగా, ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఆ డబ్బులను చెల్లించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి గన్నవరం నుంచి హజ్ యాత్రకు వెళ్లేలా ఎంబార్కేషన్ పాయింట్‌ను తాము తీసుకొచ్చామని, రాష్ట్రం నుంచి హజ్ యాత్రకువెళ్లే ముస్లింలు గన్నవరం నుంచి వెళ్లేలా ఏర్పాటు చేశామన్నారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక గన్నవరం పాయింట్‌ను క్యాన్సిల్ చేసిందని, ముస్లింలు సుమారు 1500 మంది హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకున్నారని వారికి ఒక రూపాయి కూడా సబ్సిడీ అందలేదని చెప్పారు.
- ముస్లింలకు ఎన్నికల ముందు రూ.5లక్షల వడ్డీలేని రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు ఒక్క రూపాయి ఎవరికీ ఇవ్వలేదని, పవన్ కళ్యాణ్ అయితే రూ.10లక్షలు ఇస్తామని చెప్పారని, ఒక్కరికైనా రుణం మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రూ.200కోట్ల మైనార్టీల ఆస్తులు కబ్జా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు.
- నియోజకవర్గంలో సుమారు మూడువేలమంది మైనార్టీలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని, వారిలో కొంతమంది పేదవారు ఇప్పటికీ ఇళ్లు కట్టుకోలేక పోయారని, ఇప్పుడా స్థలాలు వెనక్కి తీసుకొని టీడీపీ చెందిన కొత్తవారికి ఇవ్వాలని చూస్తున్నారని డాక్టర్ గోపిరెడ్డి ఆరోపించారు.

మైనార్టీలకు అన్యాయం

పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు పీఎస్ ఖాన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటుతున్నా ఇప్పటివరకు జిల్లాలో ఖబర్‌స్థాన్, షాదీఖానాలకు కమిటీలు వేయలేదన్నారు. దుల్హన్ పథకం అమలుచేయలేకపోయారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జలీల్, నరసరావుపేట పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లాలు మాట్లాడగా, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్, నియోజకవర్గ మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ సిలార్‌బాషా, జిల్లా కార్యదర్శి సయ్యద్‌ఖాదర్‌బాషా, పాదిలే ఖాజా, వరవకట్ట బుజ్జి తదితర మైనార్టీసెల్ నాయకులు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట: పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలను సంతృప్తికరంగా, సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ సూరజ్ గనోరే, జిల్లా అధికారులతో కలిసి నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 122 అర్జీలు స్వీకరించారు. కలెక్టరు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు కలెక్టరు సూచించారు. వివిధ శాఖల జిల్లా, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరించి సమస్యలు వింటున్న కలెక్టర్, అధికారులు

రూ.15వేలు పింఛన్ ఇప్పించండి

నాకు ముగ్గురు పిల్లలు. పెద్దవాడికి పుట్టుకతోనే అంగవైకల్యం ఉంది. గత ప్రభుత్వంలో రూ.6వేలు పింఛన్ ఇచ్చారు. 90శాతంకుపైగా ఉన్న వారికి రూ.15వేలు పింఛన్ ఈ ప్రభుత్వంలో ఇవ్వాల్సివుండగా నా కుమారునికి అమలు కావట్లేదు. దయచేసి ఆ పింఛన్ అమలుచేసి న్యాయం చేయగలరు.

–షేక్ షాహిదా, వినుకొండ

విలీనానికి అంగీకరించేది లేదు

మా గ్రామాన్ని సత్తెనపల్లి మున్సిపాల్టీలో విలీనం చేసేందుకు మేం అంగీకరించపోయినా అంగీకరించినట్లుగా వీఆర్‌ఓ, పంచాయతీ ప్రెసిడెంట్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. గత నెల 25న గ్రామసభ జరిగినట్లుగా మేం సంతకం చేశాం. విలీనంపై కేవలం చర్చలు మాత్రమే జరిపాం. విలీనానికి మేం వ్యతిరేకం. అనుమతిస్తూ సంతకాలు చేయలేదు. గ్రామ ప్రజల అభీష్టం మేరకు పంచాయతీ విలీనాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి.

– భీమవరం పంచాయతీ మెంబర్లు

పోలీసుల అదుపులో భర్త..

భార్య ఆత్మహత్యాయత్నం

- ఉత్తరం రాసి ఎలుకల మందు తాగిన వైనం
- లేఖలో చిలకలూరిపేట ఎమ్మెల్యే పేరు ప్రస్తావన



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తులసి

చిలకలూరిపేట: తన భర్తను పోలీసులు అదుపులోకి తీసుకున్నారంటూ ఓ మహిళ ఎలుకల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన చిలకలూరిపేట పట్టణంలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని సాయికార్తీక్ సిటీ సెంటర్ కాంప్లెక్స్‌కు సంబంధించి గత కొంతకాలంగా వివాదం నెలకొని ఉంది. సిటీ సెంటర్ యజమాని, అమెరికాలో నివాసం ఉండే ఎన్ఆర్ఐ రావి మురళి తమకు అప్పు ఉన్నాడంటూ కొంతమంది గత కొంతకాలంగా కాంప్లెక్స్ ముందు టెంట్ వేసుకొని నిరసన తెలుపుతున్నారు. ఈ కాంప్లెక్స్ పక్కన ఐస్ ఫ్యాక్టరీ నిర్వహించే పరమట వెంకటరమణ రావి మురళి వద్ద ఉద్యోగిగా ఉన్నాడు. ఇతనిని ఒక కేసు విషయమై చిలకలూరిపేట రూరల్ పోలీసులు సోమవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. దీంతో ఆందోళనకు గురైన వెంకటరమణ భార్య తులసి ఉత్తరం రాసి ఆత్మహత్యయత్నం చేసింది. ఉత్తరంలో తన భర్తను అన్యాయంగా పోలీసులు తీసుకువెళ్లారని, తన భర్తకు ఏదైనా జరిగితే తాను తట్టుకోలేనని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాను అని రాసింది. దీనికి కారణం టెంట్‌లో కూర్చొన్న వారు, ఎమ్మెల్యే పుల్లారావు, పోలీసులు బాధ్యులని పేర్కొంది.

- ఘటనపై బాధితుడు వెంకటరమణ స్పందిస్తూ తనపై ఏ కేసు పెట్టారో తెలియదని, రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి సంతకాలు పెట్టించుకొని పంపించి వేశారని, ఈ నేపథ్యంలో తన భార్య ఆత్మహత్యాయత్నం చేసిందని తెలిపాడు. రూరల్ సీఐ బి.సుబ్బానాయుడును ఫోన్లో వివరణ కోరగా క్రైమ్ నంబర్ 151 /24 నమోదై ఉన్న కేసులో స్టేషన్‌కు పిలిపించి 41 నోటీసు ఇచ్చి పంపించి వేశామని తెలిపారు. ఎలుకల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన తులసి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరి చికిత్స పొందుతోంది. ఇదిలాఉండగా.. తాను సోషల్ మీడియాలో పోస్టులు పెడితే తన వద్ద పనిచేస్తున్న వెంకటరమణను వేధిస్తున్నారని ఎన్ఆర్ఐ రావి మురళి సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టడం విశేషం.

క్లుప్తంగా

యూరియా కూడా అందించలేని దిక్కుమాలిన సర్కారు

గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్ల: రైతులు, కౌలు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించలేని ప్రభుత్వం ఉంటే ఎంత.. పోతే ఎంత అని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన సెల్ఫీ వీడియోలో మాట్లాడుతూ... రైతులు వేసిన పంటకు యూరియా కూడా అందించలేని దిక్కుమాలిన ప్రభుత్వం నేడు రాష్ట్రంలో ఉందన్నారు. సుమారు రూ.10 వేల కోట్లతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడితే వాటిని చంద్రబాబు నాయుడు ప్రైవేటు వ్యాపారుల వద్ద లంచాలు తీసుకుని అమ్ముకుంటున్నాడని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతు పక్షాన నిలబడేందుకు మంగళవారం గురజాల వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి గురజాల, పల్నాడు ప్రాంత ప్రజలు, రైతులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నర్సరావుపేట నియోజకవర్గ పరిశీలకులు గౌతమ్ రెడ్డిలు విచ్చేస్తున్నారని తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య



చీరాల అర్బన్: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం చీరాల మండలం ఈపూరుపాలెం ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇందిరానగర్‌కు చెందిన శ్రీకౌసల్య (23) రెండేళ్లుగా పుట్టింటిలోనే ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి వెనుక కాలువలోని చిల్ల చెట్లకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలి సోదరుడు పల్లా లోకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఈపూరుపాలెం ఎస్సై ఎ.చంద్రశేఖర్ తెలిపారు.

కూటమి పాలనలో దగా పడిన అన్నదాత

- మాజీ మంత్రి విడదల రజిని
- 'అన్నదాత పోరు' పోస్టర్ ఆవిష్కరణ



వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: కూటమి పాలనలో రైతన్నలు అన్ని రకాలుగా దగాకు గురవుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత విడదల రజిని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతన్నలకు వైఎస్సార్ సీపీ అండగా నిలిచి పోరాడేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నరసరావుపేటలో అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం పట్టణంలోని ఆమె నివాసంలో వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జగనన్న పాలనలో ఆర్బీకేల ద్వారా యూరియా, ఇతర ఎరువులను కావాల్సినంత మేర రైతులకు అందించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక యూరియా బస్తా కోసం ఎరువుల దుకాణాల ముందు రైతులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్నదాతల సమస్యలను చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోడవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలోని రైతాంగం పీకలోతు కష్టాల్లో మునిగి ఉంటే ప్రభుత్వం మాత్రం సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు శూన్యమని విమర్శించారు. ఈ నేపథ్యంలో రైతులకు అండగా నిలిచి అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించేందుకు పార్టీ నిర్ణయించిందని తెలిపారు.

యూరియా కొరత లేదనడం హాస్యాస్పదం

ఒకవైపు యూరియా కోసం రైతులు బారులు తీరి నిలబడుతుంటే యూరియా కొరత లేదని ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు ప్రకటించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. యూరియా కొరత లేకపోతే మరి అవి ఎక్కడికి వెళ్లాయో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. రైతులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం, లేదా నాయకుడు బాగుపడిన దాఖలాలు లేవని విమర్శించారు. అన్నదాత పోరు కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, రైతు సంఘాల వారు పాల్గొని రైతులకు అండగా నిలుద్దామని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట పట్టణ, మండల, యడ్లపాడు, నాదెండ్ల మండలాల అధ్యక్షులు షేక్ దరియావలి, దేవినేని శంకరరావు, వడ్డేపల్లి నరసింహరావు, మంగు ఏడుకొండలు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏకాంబరపు సునీత, నాయకులు ఉడుతా వెంకటేశ్వరరావు, సింగారెడ్డికోటిరెడ్డి, మైలా రాజేష్, సయ్యద్ జమీర్, దాసరి అంజలి, మానుకొండ శేషిరెడ్డి, తాళ్ల అంజిరెడ్డి, కొండవీటి ఆంజనేయులు, రాచమంటి చింతారావు, గుత్తా యాములయ్య, యూసుఫ్ ఆలీ, కొప్పురావూరి పటేల్, కొచ్చెర్ల కిషోర్, గౌస్ సంధాని, షేక్ నజీర్, డీలర్ సుభాని పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు ప్రాధాన్యత

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి, మోసం తదితర 111 ఫిర్యాదులు అందాయి.

యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయా..

నేను కాస్టికో యాప్‌లో రూ.2.12లక్షలు పెట్టుబడి పెట్టాగా రూ.52,470లు వెనక్కి పంపారు. మిగిలిన డబ్బులు అడగ్గా ఎక్కువ మొత్తంలో పెట్టుబడి చేస్తే పంపుతామని యాప్ నిర్వాహకులు చెబుతున్నారు. మోసపోయానని గ్రహించి, ఫిర్యాదు చేసేందుకు వచ్చాను. నిర్వాహకులపై చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయగలరు.

– పత్తిపాటి శివన్నారాయణ, అబ్బూరు, సత్తెనపల్లి మండలం

మోసం చేసి భూమి రాయించుకున్నాడు

1.70 సెంట్ల భూమిని పెద్దకుమారుడైన ఇంటూరి రఘనాథ్‌బాబు పేరిట వీలునామా రాశాను. అతను చనిపోవడంతో వీలునామాను రద్దు చేశాను. కొంతకాలంగా రఘునాథ్‌బాబు కుమారుడు సుమంత్ నా బాగోగులు చూసుకుంటానని నమ్మించి నా పేరిట ఉన్న ఆ భూమిని తన పేరిట మార్చుకున్నాడు. దీంతో పాటు రూ.10లక్షలు అప్పుగా తీసుకున్నట్టు నోట్లు రాయించుకున్నాడు. ఇప్పుడు పట్టించుకోవడం లేదు.

– ఇంటూరి సుబ్బాయమ్మ, తాతపూడి, చిలకలూరిపేట మండలం

మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రైవేటు భాగస్వామ్యానికి నిరసనగా కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ధర్నా



కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాచేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: గత ప్రభుత్వంలో నిర్మాణం ప్రారంభించిన మెడికల్ కాలేజీలను పూర్తిచేసి ప్రభుత్వమే వాటిని నిర్వహించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ప్లకార్డులతో ధర్నాచేసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతి పత్రం సమర్పించారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఏం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వర రావు, కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు ప్రయత్నంచేస్తే, కూటమి ప్రభుత్వం వాటిలో పది మెడికల్ కాలేజీలు ప్రైవేటు భాగస్వామ్యంతో నడపడానికి ఒప్పందం చేసుకున్నామని ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు మెడిసన్ చదవాలంటే సాధ్యంకానీ పరిస్థితి ఉందని, ఇప్పటికే విద్యా, వైద్యం ప్రైవేటీకరణ వలన పేదలకు అందట్లేదని, ఇక ప్రైవేటుకు అప్పగిస్తే మరింత ఘోరంగా మారుతుందన్నారు. ఇటీవల విజయవాడలో మెడికల్ కాలేజీలు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడపాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు చేసిన ఆందోళనపై జరిగిన లాఠీచార్జిని ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, పీకేఎస్ జిల్లా కమిటీ సభ్యుడు కంబాల ఏడుకొండలు, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటనాయక్, ఎంసీపీఐ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్రహం లింకన్, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జె.పంగులూరు విద్యార్థుల ప్రతిభ



బాపట్ల: జాతీయ స్పోర్ట్స్‌డే సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జె.పంగులూరు విద్యార్థులకు బంగారు పతకాలు రావటం అభినందనీయమని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. క్రీడాకారులను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జె.పంగులూరుకు చెందిన సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ఖోఖోతోపాటు పలు క్రీడాల్లో విద్యార్థులకు బంగారు పతకాలు కైవసం చేసుకోవటం హర్షనీయమన్నారు. విద్యార్థులు మరెన్నో పతకాలు సాధించాలని సూచించారు. ఖోఖోలో గోల్డ్ మెడల్, మరో విభాగం వెయిట్ లిఫ్టింగ్ పురుషుల భాగంలో గోల్డ్, సిల్వర్ కైవసం చేసుకున్నారు. అథ్లెటిక్స్ లాంగ్ జంప్‌లో రెండో స్థానం సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు.

వృద్ధ మహిళను ఇంటి నుంచి గెంటేశారు

నగరంపాలెం: ఇంట్లోంచి బయటకు పంపించడంతో ఓ వృద్ధురాలు ఆరుబయట చీకట్లోనే ఉండిపోయింది. ఆర్టీసీ కాలనీ వెంకట్రావుపేట రెండో వీధిలోని ఓ ఇంట్లో 62 ఏళ్ల సంగీత సుధ ఉంటోంది. పైన ఆమెకు తెలిసిన కుటుంబ సభ్యులు ఉంటున్నారు. సోమవారం రాత్రి ఆస్తి విషయంపై సుధతో వారు గొడవకు దిగారు. ఇంట్లోంచి బలవంతంగా ఆమెను బయటకు పంపేశారు. లోపలకు రాకుండా గేటుకు లోపల తాళాలు వేశారు. దీంతో చేసేది లేక సుధ ఇంటి ఎదుట ఓ కుర్చీలో కూర్చుండి పోయింది. ఇంటి ఆస్తికి సంబంధించి గొడవ కోర్టులో ఉందని, ఆస్తితో సంబంధం లేని వారు ఇంట్లోంచి వెళ్లిపోవాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె వాపోయింది. స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయినట్లు తెలిపింది.

టీడీపీలోని రెండు వర్గాల కొట్లాట

నరసరావుపేట టౌన్: టీడీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆ పార్టీకి చెందిన మైనార్టీ నాయకులు రెండు గ్రూపులుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. కార్యాలయంలో తెలుగు తమ్ముళ్లు దాడులకు పాల్పడటం ఇది మూడోసారి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులతో రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ హైమారావు సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరవకట్టకు చెందిన షేక్ ఖాసిం పీరా అంజుమన్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నాడు. ఆదివారం రాత్రి గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయనికి వెళ్ళాడు. అక్కడ ఇస్లాంపేటకు చెందిన మైనార్టీ నాయకుడు షేక్ బడే బాబుతో షాపింగ్ కాంప్లెక్స్ వ్యవహారంలో వాగ్వావాదం చోటుచేసుకుంది. కాంప్లెక్స్ దుకాణదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ కాసిం పీరాపై బడే బాబు, హాజీ కరిముల్లా, కత్తి రఫీ, మీరావలి, మన్సూర్‌లు దాడికి పాల్పడ్డారు. అదేవిదంగా కాసిం పీరా, రహమత్ అలీలు తమపై దాడికి పాల్పడ్డారని బడే బాబు, కత్తి రఫీలు ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన రెండు ఫిర్యాదులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేధింపులపై ఐసీసీలో ఫిర్యాదు చేయండి

డీవీసీ(గృహహింస కేసుల) సోషల్ కౌన్సెలర్ ఎం.సంగీత



యడ్లపాడు ఎస్ఎస్ఎల్ మిల్లులో అవగాహన కల్పిస్తున్న మహిళా సంరక్షణ విభాగాల అధికారులు

యడ్లపాడు: మహిళలపై జరిగే వేధింపుల నిర్మూలనకు ఐసీసీ(ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ) ఏర్పాటు చేసినట్లు డీవీసీ(గృహహింస కేసుల) సోషల్ కౌన్సిలర్ ఎం.సంగీత తెలిపారు. మండలంలోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ మిల్లులో సోమవారం మిషన్ సంకల్ప కార్యక్రమంలో భాగంగా బాలలు, మహిళలకు చట్టాలకు సంబంధించి అవగాహన సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు సీడీపీఓ జి.శాంతకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పని ప్రదేశాలలో మహిళలపై జరిగే లైంగిక దాడుల నివారణ కోసం ఐసీసీ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే గృహహింస నిరోధక చట్టంపై మహిళలకు వివరించారు. ఓఎస్‌సీ(ఒన్ స్టాప్ సెంటర్) లీగల్ కౌన్సెలర్ కె.వాణిశ్రీ మాట్లాడుతూ మహిళా సంరక్షణ, ఉచిత న్యాయాన్ని అందించేందుకు 2006లో వచ్చి గృహహింస చట్టంపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా కేంద్రంలో వన్‌స్టాప్ సెంటర్ ద్వారా గృహహింసకు సంబంధించిన కేసుల్లో నేరుగా పోలీస్‌స్టేషన్లకు వెళ్లకుండా ముందస్తుగా ఓఎస్‌సీలో మహిళలు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఐదురోజులు వైద్యం, భోజన, వసతి కల్పించి వారికి కుటుంబ సభ్యులను కలిసి బాధిత మహిళకు న్యాయం పొందే అవకాశం ఉందన్నారు. అక్కడ కూడా న్యాయం లభించకుంటే ఆ తర్వాత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కోర్టుద్వారా న్యాయం పొందవచ్చన్నారు. సీడీపీఓ జి.శాంతకుమారి మాట్లాడుతూ బాల్యవివాహాలు, గర్భిణులు – బాలింతలు, పిల్లల ఆరోగ్యం, పోషణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్.సామ్రాజ్యం, కె.వెంకటరమణ, మహిళా పోలీస్ నిర్మల, వలస కూలీలు, మహిళా కార్మికులు, అంగన్‌వాడీ తల్లులు పాల్గొన్నారు.

జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికలు



ఎంపికైన బాలికల టీంతో వ్యాయామ ఉపాధ్యాయులు



బాలుర టీంతో వ్యాయామ ఉపాధ్యాయులు

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ సెలక్షన్స్ సోమవారం జరిగాయి. ఈ సెలక్షన్స్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో గల వివిధ పాఠశాలల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 32మంది క్రీడాకారులను ఉమ్మడి గుంటూరు జిల్లా టీంకు ఎంపిక చేశారు. వారిలో బాలుర నుంచి 16 మంది, బాలికల నుంచి 16మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెలలో వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీసీ కమిటీ చైర్మన్ ఏడుకొండలు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను విశ్రాంత హెచ్‌ఎం ఎన్. రామకష్టారెడ్డి, హెచ్ఎం బీఎం సుభాని, వ్యాయామ ఉపాధ్యాయుడు సైదయ్య అభినందించారు.

కొత్తరెడ్డిపాలెంలో విష జ్వరాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో పది రోజుల్లో ఇద్దరు విష జ్వరాలతో మరణించటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామాలయం సెంటర్ పరిధిలో కొద్ది రోజుల కిందట బడే రాము అనే వ్యక్తి విష జ్వరంతో గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ కిడ్నీ, ఇతర సమస్యలతో మృతి చెందాడు. ఇదే ప్రాంతంలో గత నెలలో మరో వ్యక్తి జ్వరం బారిన పడి మృతి చెందటంతో స్థానికంగా ఆందోళన వ్యక్తం అవుతోంది. కొత్తరెడ్డిపాలెం సమీప ప్రాంతాల్లో జ్వర పీడితులు సంఖ్య అధికంగా ఉండటంతో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. మంగళవారం గ్రామంలో రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు.